గ్రూప్ 1 మెయిన్స్.. 3వ చాప్టర్ విశ్లేషణ

1999లో 6 బిలియన్లు ఉన్న ప్రపంచ జనాభా.. 2011 నాటికి 7 బిలియన్లకు చేరుకోగలదని అంచనా. జనాభా వృద్ధిరేటు అభివృద్ధి చెందుతోన్న దేశాలలో అధికంగా కనిపిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా యువ జనాభా (యూత్ పాపులేషన్) పేద దేశాలలో ఎక్కువగా కేంద్రీకృతమవుతోంది. ప్రపంచవ్యాప్తంగా రోజుకు 10 డాలర్లలోపు వ్యయంతో జీవించగలిగే జనాభా సుమారు 80 శాతం వరకు ఉంది. ప్రపంచవ్యాప్తంగా 80 శాతం జనాభా ఆదాయ వ్యత్యాసాలు ఎక్కువగా ఉన్న దేశాలలో నివిసిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో నిరుద్యోగం, పేదరికం అనే భావనలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఇవే ప్రధానాంశాలుగా మెయిన్స్‌ను మూడో చాప్టర్‌ను రూపొందించారు.

గ్రూప్1 - 3వ చాప్టర్ సిలబస్:

దారిద్ర్యం, నిరుద్యోగ సమస్యలు- ఈ సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన చర్యలు

ఎక్స్‌పెక్టెడ్ ప్రశ్నలు:

1. పేదరికాన్ని నిర్ణయించే కారకాలను తెలిపి భారత్ వంటి అభివృద్ధి చెందుతున్న దేశాలలో పేదరికం అనేది ముఖ్య ఆర్థిక సమస్యగా పరిణమించడానికి కారణాలు తెలపండి?

జ: పేదరికాన్ని నిర్ణయించే ముఖ్య కారకాలు:

ఎ) ఉత్పాదక ఉద్యోగిత లోపించడం, అల్ప ఉద్యోగిత వలన ప్రజల ఆదాయాలు తక్కువగా ఉండటం.

బి) ప్రజలు వినియోగించే ఆహార ధాన్యాల ధరలు విపరీతంగా పెరగడం

సి) సాంఘిక అవస్థాపనా సౌకర్యాలు కొరవడి ప్రజల నాణ్యతపై ప్రభావం చూపిస్తూ వారు తమ సామర్థ్యానికి గల ఉద్యోగిత చేపట్టలేకపోవడం. భారతదేశంలాంటి అభివృద్ధి చెందుతున్న దేశాలలో పేదరికంలో నివసించే జనాభా ఎక్కువగా ఉండటానికి వెనుకబడిన స్వభావం గల ఆర్థిక వ్యవస్థ, జనాభా వృద్ధిరేటు అధికంగా ఉండటంతోపాటు ఒకవైపు జాతీయాదాయం పెరిగినప్పటికీ తలసరి ఆదాయం పెరగకపోవడం, ఆస్తుల యాజమాన్యం విషయంలో అసమానతలు ఎక్కువగా ఉండటం, వ్యవసాయ,



పారిశ్రామిక రంగాలలో అల్ప ఉత్పాదకతతోపాటు నిరుద్యోగం, అల్ప ఉద్యోగితను కారణాలుగా పేర్కొనవచ్చు. వీటితోపాటు విద్య, ఆరోగ్యం, నేర్పరితనం వంటి ప్రమాణాలు పెంపొందించుకోవడంలో అసమానతలు ఎక్కువగా ఉండటం, దేశంలో ప్రాంతీయ అసమానతలు పెరగడం మన దేశంలో పేదరికం విస్తృతమవడానికి కారణాలు.

2. స్వాతంత్ర్యానంతరం పేదరిక అంచనాలను వివరించండి. నిరపేక్ష, సాపేక్ష పేదరిక భావనలను ఎలా మదిస్తారో వివరిం చండి?

జ: పేదరికాన్ని అంచనా వేయడానికి కొంతమంది ఆర్థికవేత్తలు విశేష కృషి చేశారు. వీరిలో దండేకర్ అండ్ రథ్, ఓజా, మిన్‌హాస్, బర్ధన్, అహ్లూవాలియాలు ముఖ్యులు. పేదరికాన్ని రెండు రకాలుగా వర్గీకరించవచ్చు. అవి..

1) నిరపేక్ష పేదరికం; 2) సాపేక్ష పేదరికం.

భారతదేశంలాంటి అభివృద్ధి చెందుతున్న దేశాలలో పేదరికాన్ని నిరపేక్ష పేదరికంగా భావించవచ్చు. నిరపేక్ష పేదరికాన్ని తలల లెక్కింపు నిష్పత్తి, సేన్ పేదరిక సూచీ ద్వారా కొలవవచ్చు. సాపేక్ష పేదరికాన్ని లారెంజ్ వక్రరేఖ లేదా దీనితో సంబంధం ఉన్న గిని గుణకం ద్వారా కొలవవచ్చు. ఈ ప్రశ్నకు సంబంధించిన జవాబులో దత్తాంశం ఆధారంగా విశ్లేషణ చేయాలి. ప్రణాళికా సంఘం పేదరిక అంచనాలకు సంబంధించిన విశ్లేషణతోపాటు 2004-05 నేషనల్ శాంపుల్ సర్వే యూనిఫారం రీకాల్ పీరియడ్, మిక్స్‌డ్ రీకాల్ పీరియడ్ ఆధారంగా చేపట్టిన పేదరిక అంచనాలకు సంబంధించిన అవగాహన అవసరం. అభివృద్ధి చెందిన దేశాలలోని పేదరికాన్ని సాపేక్ష పేదరికంగా వర్ణిస్తారు. ఈ దేశాలలో ఆదాయ అసమానతలను కొలవడానికి లారెంజ్ వక్రరేఖ లేదా గినీ గుణకాన్ని ఉపయోగించాలి.

3. సంస్కరణల కాలంలో ఆర్థికాభివృద్ధికి అనుపాతంగా పేదరికం తగ్గకపోవడానికి కారణాలను విశ్లేషించండి?

జ: సంస్కరణల అమలు కాలంలో ఆర్థికాభివృద్ధి వేగవంతమైనప్పటికీ దానికి అనుపాతంగా ఉపాధి అవకాశాలు పెరగ లేదు. కొన్ని

వర్గాల ప్రజలు సంస్కరణల యుగంలో లబ్ధి పొందలేకపోవడానికి గల కారణాలను విశ్లేషించాలి. ప్రైవేటు రంగానికి పెద్ద ఎత్తున అవకాశాలు కల్పించడం మరో వైపు ప్రభుత్వ రంగం తన బాధ్యతల నుంచి తప్పుకోవడం వలన ఆర్థిక స్థోమత కేంద్రీకరణకు అవకాశాలు మెరుగుపడి కొన్ని వర్గాల ప్రజలు సంస్కరణల వలన లబ్ధి పొందలేక పోయారు. సంస్కరణలు చోటు చేసుకున్న పారిశ్రామిక రంగం, బ్యాంకింగ్ రంగం, మూలధన మార్కెట్, విదేశీ వాణిజ్యం, ఇన్సూరెన్స్ రంగాలు ఆర్థిక అసమానతలు పెరగడానికి దోహదపడ్డాయి. శ్రామిక మార్కెట్‌లో అసంపూర్ణ తలను కూడా పరిశీలించాల్సిన అవసరం ఉంది. అదే విధంగా ఆర్థిక సంస్కరణలు శ్రమ సాంద్రతమైన ఉత్పత్తి పద్ధతులకు ప్రాధాన్యం ఇవ్వక పోవడం వలన ఉపాధి అవకాశాలు తగ్గి పేదరికం పెరిగింది.

4. నేషనల్ శాంపుల్ సర్వే నిరుద్యోగాన్ని కొలవడానికి ఏ భావనలను ఉపయోగిస్తుందో తెలిపి గ్రామీణ ప్రాంతాలలో నిరుద్యోగాన్ని ఎలా వర్గీకరించవచ్చో వివరించండి?

జ: **భారత దేశంలో నిరుద్యోగం పెరగడానికి...**

ఎ) వెనుకబడిన స్వభావం కలిగిన ఆర్థిక వ్యవస్థ

బి) సరైన ఉద్యోగితా ప్రణాళిక లేకపోవడం

సి) జనాభా అధిక వృద్ధి లాంటి కారణాలను విశ్లేషించాలి. నేషనల్ శాంపుల్ సర్వే నిరుద్యోగితను అంచనా వేయడానికి ఉపయోగించే రోజువారి స్థితి నిరుద్యోగం, వారం వారీ స్థితి నిరుద్యోగం, సాధారణ స్థితి నిరుద్యోగం లాంటి భావనలను పరిశీలించాలి. వీటిలో రోజువారీ స్థితి నిరుద్యోగం భావన సరైన భావనగా భావించి దాని ఆధారంగా గణాంకాలను పరిశీలించాలి.

భారత దేశంలో గ్రామీణ ప్రాంతాలలోని నిరుద్యోగాన్ని...

ఎ) రుతు సంబంధమైన నిరుద్యోగం

బి) ప్రచ్ఛన్న నిరుద్యోగం

సి) దీర్ఘకాలిక, సాధారణ స్థితి నిరుద్యోగంగా వర్గీకరించవచ్చు. ఈ విధమైన నిరుద్యోగాలు గ్రామీణ ప్రాంతాలలో ఎక్కువగా కనిపించడానికి వ్యవసాయ రంగంలోని అనిశ్చి తస్థితిని పరిశీలించాలి. దీంతోపాటు గ్రామీణ పరిశ్రమలు కుంటుపడటం, ప్రభుత్వ ప్రోత్సాహాలు కూడా తక్కువగా ఉండటం లాంటి కారణాలు విశ్లేషించగలగాలి.

5. వేతన ఉపాధి పథకాలు - స్వయం ఉపాధి పథకాల విషయంలో పేదరిక,నిరుద్యోగ నిర్మూలనకు ఏ పథకాలను మీరు ఉత్తమమైన విగా భావిస్తారు?

జ: స్వాతంత్ర్యానంతరం ప్రణాళికాపరంగా ప్రభుత్వం అనేక పేదరిక నిర్మూలన, నిరుద్యోగ నిర్మూలన కార్యక్రమాలను ప్రవేశపెట్టింది. వీటిని

ఎ) స్వయం ఉపాధి పథకాలు

బి) వేతన ఉపాధి పథకాలు

సి) ఏరియా స్పెసిఫిక్ ప్రోగ్రాంలు (ప్రాంతానికి ప్రత్యేకించిన కార్యక్రమాలు)గా వర్గీకరించ వచ్చు. ఈ పథకాలలో ముఖ్యంగా స్వయం ఉపాధి, వేతన ఉపాధి పథకాలకు సంబంధించి ఏ పథకాలు గ్రామీణ ప్రజల స్థితిగతులను మెరుగుపరచి పేదరిక నిర్మూలనకు దోహదపడగలవు అనే అంశంపై ఆర్థికవేత్తల మధ్య చర్చ జరుగుతోంది. దేశంలో ఉన్న వాస్తవ పరిస్థితులను పరిశీ లిస్తే వేతన ఉపాధి పథకాలే పేదరిక నిర్మూలనకు దోహద పడగలవని ఆర్థిక వేత్తలు ఎక్కువమంది అభిప్రాయపడుతున్నారు. స్వాతంత్ర్యానంతరం ప్రోత్సహించిన స్వయం ఉపాధి పథకాలలో 90 శాతం ఆశించిన ఫలితాలు ఇవ్వలేక పోయాయి.

సబ్సిడీలు, అనేక రాయితీలతో కూడుకున్న రుణాలను అందించినప్పటికీ ఈ పథకాలు తమ లక్ష్య సాధనలో విఫలమయ్యాయి. 1993 ఆగస్టు 15న ప్రారంభించిన 'ప్రధానమంత్రి రోజ్‌గార్ యోజన' ద్వారా ప్రభుత్వం విద్యావంతులైన నిరుద్యోగులకు అనేక పథకాలు రూపొందించినప్పటికీ అవి ఆచరణలో విఫలమయ్యాయి. ప్రస్తుత సంక్షోభ సమయంలో వేతన ఉపాధి పథకాలే ఉత్తమమయి నవిగా కనిపిస్తున్నాయి. వీటికి గల కారణాలను విశ్లేషించాలి.

6. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ప్రగతిని వివరిస్తూ ఉపాధి పెరుగుదలకు ఈ పథకం ఏ విధంగా దోహదపడు తుందో వివరించండి?

జ: 2006 ఫిబ్రవరిలో ప్రారంభించిన 'జాతీయగ్రామీణ ఉపాధి హామీ పథకం' గ్రామీణ ప్రాంతాలలో పనిలో పాల్గొనగలిగే సామర్థ్యం ఉన్న అందరికీ ఉపాధి కల్పిస్తూ గ్రామీణ దారిద్ర్య నిర్మూలనకు చక్కటి ప్రోత్సాహం అందిస్తోంది. ఈ పథకం ద్వారా చేపడుతున్న పనుల ద్వారా గ్రామీణ వికాసానికి ఉన్న సంబంధాన్ని పరిశీలిస్తూ విశ్లేషణ చేయాల్సిన అవసరం ఉంది.

7. ఉపాధి పెరుగుదలకు తీసుకోవాల్సిన వ్యూహాలను చర్చిం చండి?

జ: ఉపాధి పెరుగుదలకు అవలంభించాల్సిన వ్యూహాలను ఒక ముఖ్యమైన ప్రశ్నగా భావించవచ్చు. ఈ వ్యూహాలను కింది అంశాల వారీగా విశ్లేషించాలి.

ఎ) వ్యవసాయం

బి) వ్యవసాయ భూమి వినియోగం, భూ చట్టాల సరళీ కరణ

సి) ఫుడ్ ప్రాసెసింగ్

డి) గ్రామీణ ప్రాంతాలలో వ్యవసాయేతర కార్యక్రమాలు ముఖ్యంగా ఖాదీ,గ్రామీణ పరిశ్రమల అభివృద్ధి

ఇ) ఆరోగ్య సేవలు పెంపొందించడం

ఎఫ్) విద్యా సర్వీసులు పెంపొందించడం

జి) ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ పాత్ర

హెచ్) రోడ్డు రవాణా,రోడ్డు నిర్మాణ పనులు వేగవంతం చేయడం

8. దారిద్ర్యం, నిరుద్యోగం ఏ విధమైన పరిణామాలకు దారి తీస్తాయి?

జ: దేశంలో పెరుగుతున్న నిరుద్యోగం తద్వారా పేదరిక పెరుగుదల దేశ ఆర్థికాభివృద్ధిపై ప్రతికూల ప్రభావాన్ని చూపిస్తాయి. ఆదాయ అసమానతలు, ప్రాంతాల మధ్య అసమానతలు పెరుగుతాయి. తాగునీటి సౌకర్యం పొందలేకపోవడం, మరణాల రేటు పెరగడం, పౌష్టికాహార లోపం లాంటి సమస్యలు అధికమై మానవాభివృద్ధి కుంటుపడు తోంది. పెరుగుతున్న దారిద్ర్యం, నిరుద్యోగం లాంటి సమస్యలు దేశంలో అశాంతి, తీవ్రవాదం పెరగడానికి దారి తీస్తున్నాయి.

ముఖ్యాంశాలు

- యూనిసెఫ్ అభిప్రాయంలో పేదరికం వల్ల రోజుకు 25,000 మంది పిల్లలు మరణిస్తున్నారు. అభివృద్ధి చెందుతున్న దేశాలలో 27 నుంచి 28 శాతం వరకు శిశువులు సరైన బరువులేకుండా జన్మించారు.
- 2005లో అభివృద్ధి చెందుతున్న దేశాలలో ప్రాథమిక విద్యను అభ్యసించవలసిన వయసులో ఉన్న 72 మిలియన్ పిల్లలు స్కూళ్లలో నమోదు కాలేదు. వీరిలో 57 శాతం మంది బాలికలే.
- దక్షిణాసియా ప్రాంతంలో 706 మిలియన్లు, సబ్-సహారా ఆఫ్రికా ప్రాంతాలలో 547 మిలియన్లు, తూర్పు ఆసియా ప్రాంతంలో 224 మిలియన్లు, ఇతర ప్రాంతాలలో 101 మిలియన్ల విద్యుత్ సౌకర్యానికి నోచుకోలేదు.
- ప్రపంచవ్యాప్తంగా జరిగే ఆయుధాలపై చేసే వ్యయాన్ని 1 శాతం కన్నా తక్కువగా తగ్గించుకోగలిగితే 2000 సంవత్సరం నాటికి పాఠశాల విద్యకు దూరంగా ఉన్న పిల్లలను పాఠశాలల్లో చేర్చగలిగే (ఎన్‌రోల్‌మెంట్) అవకాశం ఉన్నప్పటికి అది ఇప్పటి వరకు సాధ్యం కాలేదు.
- అభివృద్ధి చెందుతున్న దేశాలలో 1.1 బిలియన్ ప్రజలు శుభ్రమైన నీటికి, 2.6 బిలియన్ ప్రజలు పారిశుద్ధ్య సౌకర్యాలకు నోచుకోలే కపోతున్నారు.
- ప్రపంచవ్యాప్తంగా పిల్లల సంఖ్య 2.2 బిలియన్ కాగా వీరిలో 1 బిలియన్ పిల్లలు పేదరికంలో ఉన్నారు. 121 మిలియన్ పిల్లలు విద్యకు దూరంగా ఉన్నారు.